


ప్రతి వ్యక్తి జీవితంలోనూ, అతను మర్చిపోలేనిది, విడమర్చి యితరులకు చెప్పలేనిది—ఒకవేళ చెప్పినా యితరులు వేరుగా అర్థం చేసుకొని, అతనికి విలువకట్టేది—ఏదో రహస్యముంటుందని నా నమ్మకం. అలాంటి రహస్యాలు కల్గి ఉండటం మానవునకు సహజమేమో ! అదే మానవ జీవితంలోవున్న మహోన్నత, ఉత్కృష్టతాలేమో !

మొన్నీ నడుమ, మా ప్రక్క యింటివారమ్మాయి "సుగుణ'' మాటల సందర్భంలో, ఆ

అమ్మాయి భర్తను గురించి చెప్పటం జరిగింది. అక్కా, అక్కా, అంటూ నాతో, ఎంతో కల్సిమెల్సి ఉంటుంది.

"అప్పుడప్పు డెందుకనో అక్కా, నాకు చచ్చిపోవాలనిపిస్తుంది".

"ఏమిటమ్మా, ఆ శ్మశాన వైరాగ్యం"

"నిజంగానే అక్కా" అంటుండగానే అదోక రకంగా మారిపోయింది సుగుణ మొఖం.

"అదేమిటి సుగుణా. నీ కేమైనా పిచ్చా...నీకేమి తక్కువ ? శ్రీమంతుల ఏకైక బిడ్డవు...కొంపతీసి, మా మరిది గారిపై కోపంరాలేదుగదా !" అన్నాను సుగుణను సంతోషపెట్ట ప్రయత్నిస్తూ.

"నా కంత అదృష్టం లేదక్కా....నే నసలంత అదృష్టవంతురాలను గాదు" అన్నది ఏడుస్తూ.

సుగుణభర్త తల్లితరపు చుట్టం. అత నదొక రకమైన వ్యక్తి. సుగుణకు యిష్టంలేకపోయినా, తల్లి పోరువల్ల అమాయకుడైన తండ్రిని, వాళ్ళంతా కల్సి ఏమైనా చేస్తారేమోననే భయంతో, తన కొరకు కాకపోయినా, తన తండ్రికొరకు వివాహమాడినట్లు వెక్కి, వెక్కి, ఏడుస్తూ చెప్పింది సుగుణ. కిలకిలా నవ్వుతూ, ఎంతో అందంగా ఉండే ఆ అమ్మాయి హృదయంలో అంతబాధ యిమిడుందని ఎవ్వ రనుకొంటారు ? ఆ బాధ, వ్యధ, రగిలి, జ్వాలై వెర్రితలలు వేస్తే ఎవ రార్పగలరు ?

నా వివాహం అయి మూడు సంవత్సరాలైంది.

నా భర్త రాము, నేనూ, యీ మూడు సంవత్సరాలనుండి, పాలు తాగుతున్న పిల్లలలా జీవిస్తున్నామనిపించింది. నిజానికి ఈ జీవితంలో ఎవ్వరు సుఖపడుతున్నారు ? సున్నావచ్చిన వాడికన్నా, ఒక్కమార్కు వచ్చినవాడు మెరుగట. అంతే యీ జీవితం కూడాను. రాము, ఎంతో సౌమ్యుడు. మంచివాడు. మంచివాడని నే ననటమేగాదు, అయిన వారు, కానివారు, ఎరిగున్నవా రందరూ, అదే మాటంటారు. ఆఫీసులో వారి క్రింద పని చేసేవారు, పైవారు, అందరూ రామంటే ఆదరాభిమానాలు చూపిస్తుంటారు. ఎంతో గౌరవమిచ్చి ప్రేమిస్తుంటారు. అతనిలో ఏమి గొప్పతన ముందని వాళ్ళంతా అతనంటే, అంత ఆప్యాయంగా ఉంటా రనిపిస్తుంది నాకు. "ఓ-రామూ ? నీ చిరునవ్వుతో లోకాన్ని మోసపుచ్చ గలవుగాని, నన్ను మాత్రం గాదు సుమా ! నీవు చెప్పకపోయినా, ఆ నవ్వులో అవ్యక్తమైన బాధ, వ్యధ యిమిడున్నవని నాకు తెల్సు" అని అనాలని నా కప్పుడప్పుడు అనిపిస్తుంటుంది. మే మిద్దర మెంతో సరదాగా, నల్గురూ తలంచినట్లెంతో అనురాగపు టానందాలతో బ్రతుకుతున్న మా సంసారంలో, ఏదో లోటున్నట్లు నా కన్పించుచుతూంటుంది. మానవుడు తనను

ప్రేమించే-వ్యక్తినిగాక మరొక వ్యక్తిని ప్రేమించుతుంటా డనుకొంటా. అందు వల్లనే జీవిత మింత క్లిష్టసమస్యగా తయారైందేమో!

రాము తనకు తాను చెప్పకపోయినా మా అత్తవారి పొరుగింటావిడ చెప్పగా అతని విషయాలు కొన్ని తెల్సుకో గల్గాను.

''రాము కుటుంబం ఒకప్పుడు బాగా వున్న కుటుంబం. వ్యాపారంలో నష్టాలు వచ్చి, బాగా చితికిపోయింది. వాళ్ళ యింటికి, రెండు మూడు యిళ్ళవతల వాళ్ళకు దూరపు బంధువులు, బాగా వున్న వారు, ఉంటూండేవారు. వాళ్ళకు 'సరూ' అనే ఒకమ్మాయి ఉండేది. సరూ ఒక్కగా నొక్క కూతురు. ఎర్రగా, అందంగా, ఎంతో చలాకీగా వుండేది. రాము, సరూ కలిసిమెలిసి చదువుకొంటూ ఉండేవారు. ఆ రెండు కుటుంబాలవారు వాళ్ళిద్దరూ భార్యభర్తలై, ఎంతో ఆనందంగా ఉంటా రనుకొంటూ వాళ్ళను చూచుకొని మురిసి పోతూండేవారు. తరువాత పై చదువుకు రాము పట్నం వెళ్ళాడు. సరూని చదువు మాన్పించి, యింటివద్దనే హిందీ, సంగీతం చెప్పిస్తుండేవారు. అలారోజులు గడచిపోతుండగా, మా మామగార్కి వ్యాపారంలో బాగా నష్టంవచ్చి, కుటుంబం పూర్తిగా చితికిపోయింది. సరూకు యితర సంబంధాలు చూస్తున్నారని తెల్సి



"కొత్తగా రిలీజవుతున్న సినిమాకి టికెట్లు కొన్నాను."
"అయితే బట్టలేసుకోడం మొదలెట్టనా''
"ఆ తప్పకుండా మొదలెట్టు టికెట్లు రేపటికే"

ఒకనాడు మా మామగారు వెళ్ళి సరూ తండ్రి నడుగుతానన్నారట. రాము వద్దని ఎంతగానో చెప్పాడట కూడాను. మా అత్తగారూ, మా మామగారూ సరూ అంటే ఎంతో ప్రేమగా వుండటంవల్ల రాము మాట వినక వెళ్ళి అడిగారట. వారు; పోయిన తరంలో వాళ్ళ కుటుంబంలోని ఆడపిల్ల నొకరిని మా మామ గారి కుటుంబంలోనే యిచ్చి వివాహం చేశామనీ; పెళ్ళైన సంవత్సరంలోనే పెళ్ళికొడుకు చనిపోయాడనీ, అందు వల్లనే సరూకు బైట సంబంధం చేయ దలచామనీ, చెప్పారట.

ఆ తరువాత కొద్దికాలానికే ''సరూ''కు పెళ్ళి బ్రహ్మాండంగా జరిగింది. దుర

దృష్టవశాత్తూ సంవత్సరం తిరగకముందే సరూ భర్త గుండెజబ్బుతో చని పోయాడు. అటు తరువాత ,సరూ తండ్రి వాళ్ళ ద్వారా వీళ్ళ ద్వారా సరూను వివాహమాడమని రాముకు రాయబారాలు పంపాడట. రామూ మొదట్లో తనసలు పెండ్లి చేసుకో దలచుకొనలేదనీ, తరువాత సరూని చేసుకొననసీ చాల గట్టిగా చెప్పాడట. సరూకు కూడ బైటనుండి రెండు మూడు సంబంధాలు వచ్చినా, ఆమె ఒప్పుకొన లేదట. మా పెళ్ళైన రెండు నెలలలోనే ననుకొంటాను సరూ ఆత్మహత్య చేసుకుంది.

"ఉండి ఎవ రనుభవించారు చెప్పు? ఆ పిల్ల ఉసురు పెట్టుకున్నారు'' అంటూ యింకేవేవో ఆవిడగారు అన్నది. ఆ తరువాత వూరుకొనలేక మా చిన్న మరదలను పిల్చి చాటుగా ''సరూ వదిన నెరుగుదువా?'' అని అడిగా అదొక రకంగా.

''ఓ! సరూ వదినె ఎంత అందంగా ఉంటుందనుకున్నావు? చాల మంచిది'' అంటూ ఆ పదేళ్ళ పిల్ల నా బాధను గ్రహించకుండా పరుగెత్తుకొని పోయింది.

''నేను మాత్రం కాదా?'' అని అడుగు దామనుకొన్నా. కాని సిగ్గుతో, బాధతో, వ్యధతో అడుగలేకపోయాను. ఏదో కొద్దిగా పరిచయమున్న మా మరదలే, సరూ అంటే అంత యిదిగా ఉంది గదా, యిక రాము కెలా వుండుండాలి? ప్రేమించు కొన్నారు. పెళ్ళి చేసుకొని ఆనందంతో కాలం గడపాలని ఊహించు కున్నారు. అటువంటి ఎన్నో కలలుగన్న రామూహృదయానికి తగిలిన గాయాన్ని ఎవరు మాన్పగలరు?

నాకు ఆ హృదయంలోను, 'సరూ' వుండవల్సిన యీ యింటిలోను ఎలాంటి స్థాన ముంది? ఇటువంటి ఆలోచనలతో సతమత మౌతుంటాను. మరీ రాము ప్రక్కన పరున్నప్పుడు,అత నేమీ ఎరుగ నట్లు ఎంతో ఆప్యాయంగా, ప్రేమతో కబుర్లు చెబుతూన్నప్పుడు, 'సరూ' గుర్తు కొచ్చి అదొక రకంగా బాధ పడుతుం టాను. నా స్థానంలో సరూ వుండటం జరిగుంటే రాము యింకెంత సంతోషా నందాలతో వుండేవాడో ననుకొం టాను. వెంటనే నే నెచ్చటున్నదీ, నా స్థితీ గుర్తుకు రావటంతో అతని గాయాన్ని రేపుతానేమో ననే భయంతో, తెచ్చి పెట్టుకొన్న నవ్వుతో నా పాత్ర నిర్వ హిస్తుంటాను.

నా గత జీవితం గూర్చి తెల్సి రాము కూడా నా లాగే బాధపడుతూ, ,ఆలో చిస్తూంటాడేమో!

* * *

"రవి ఎంతో మంచివాడు. ఎర్రగా, సన్నగా, బారుగా ఉండేవాడు. అతని కళ్ళె ప్పుడూ దేనికొరకో వెతుకుతున్నట్లుం

దేవి. అతనూ, నేనూ రెండు సంవత్సరాలు సహాధ్యాయులం. అప్పుడే మా యిద్దరకూ స్నేహం ఏర్పడింది. క్లాసు వక్తృత్వ పోటీలలోనూ, అనేక యితర కార్యకలాపాలలోను మేమిద్దరం పాల్గొంటూ వుండేవాళ్ళం. అతను పరిచయం కానివాళ్ళ ముందేమీ మాట్లాడేవాడు కాదు. అన్నింటికీ 'ఊ' కొడుతుండేవాడు. చివరకు మాత్రం తను చేయదల్చుకొన్నదేదో చేసి ఊరుకొనేవాడు. పరిచయం వున్న నాబోటి వారితో, ఎంతో సరదాగా వుంటూ వుండేవాడు. అతనికెదురుగా కబుర్లు చెప్పుకొంటూ కూర్చొంటే కాలం తెలియకుండానే గడచిపోతూండేది.

అతనూ, ఉన్న కుటుంబంలోనే పుట్టాడు. ఒక్కగా నొక్క కొడుకు. ఎప్పుడూ నీటుగా, శుభ్రంగా ఉండి, కులాసాగా కాలం గడపటమంటే అతనికి తగని సరదా. అతనికి కూడా నా మాదిరిగానే, చల్లని గాల్లన్నా, వానజల్లన్నా మహా యిష్టం. ఒకటి రెండుసార్లు, నేను వాతావరణం చల్లగా వున్నప్పుడు, బీచివెంట నడుస్తూవుంటే అతను తన కారులో వచ్చి బీచివెంట నడుస్తూవుండగానూ, కారులోనే కూర్చొని, ఏదో పుస్తకం చదువుకొంటూ వుండగానూ చూశాను. అలాంటి సమయంలోనే, ఒకనాడు మొదటిసారిగా మా యిద్దరికీ పరిచయ మయ్యింది. ఆ పరిచయమే విడిచి వుండలేని స్నేహానికి దారి




"చూశారూ! ఆ అమ్మాయి నన్ను ముక్కు లేని ముఖం అంటూ పోతుంది. ఎంత పొగరు!"
"అయితే అది చెప్పింది నిజమా, కాదా అని నన్నడుగుతున్నారా?"

తీసింది. ఆ స్నేహమే, నా జీవితాన్ని మానని గాయంగా చేసింది. నావలె, అతనుకూడా ఆ చల్లని వాతావరణం కొరకు తహతహలాడతాడనీ ఎంతో ఆహ్లాదాన్ని పొందుతూంటాడనీ తెలుసుకొన్నప్పుడు నేనెంతో ఆనందించాను. అభిరుచులొక్కటైన వ్యక్తులు కల్సినప్పుడు, వారి స్నేహం భవిష్యత్తును గుర్తించక, పరిస్థితులను లెక్కచేయక, నానాటికీ వృద్ధిపొందట మనేది అతి సహజమైన విషయ మనుకొంటాను.

మా నాన్నకు, అమ్మకు, చదువు మీదెంతో అభిమాన ముండటంవల్ల, నా అభీష్టానుసారంగా, నేను చదువుకొనటానికి వారు ఒప్పుకొన్నారు. నేను కూడా వాళ్ళిచ్చిన అవకాశాన్నీ, స్వేచ్ఛనూ అర్ధంచేసుకొని, హద్దు పద్దుల

లోనే నడుస్తూవుండే దాన్ని. కాని రవి విషయంలో మాత్రం అలా వుండలేక పోయాననే చెప్పాలి. నాకూ, రవికీ వున్న సంబంధం, అమ్మకూ, నాన్నకూ తెలుసునో లేదో నాకు తెలియదు. నే నెప్పుడూ చెప్పనూలేదు. వాళ్ళు నన్నడగనూలేదు. మాది ఉన్న కుటుంబం కాకపోయినా, కూటికీ, గుడ్డకూ కరువు వాసిన కుటుంబం మాత్రం కాదు.

క్రమేణా రవికీ నాకూ చాల స్నేహం ఏర్పడింది. దాదాపు, ఎప్పుడూ మేమిద్దరం కలిసే వుంటూ వుండేవాళ్లం. చల్లగావుంటేసరి, బీచికిగానీ, షికారుకు గానీ వెళ్ళటానికి రవి తయారు. ఒక్కొక్కసారి, అలా బీచిలో కారును పార్కుచేసి, చెరొక పుస్తకం తీసి చదువుతూ, మాట్లాడకుండా గంటలు, గంటలు గడుపుతూండేవాళ్ళం. క్లాసులు కూడ ఎగగొట్టుతూ వుండే వాళ్ళం. చివరికి రవిని గనుక, ఒక్కరోజైనా, చూడకపోతే నా మనస్సు పరిపరి విధాలుగా పోతూవుండేది. అతని ఆరోగ్యం బాగుండలేదేమోననీ, ఏక్సిడెంట్ ఏమైనా జరిగిందోమోననీ భయపడుతూ వుండేదాన్ని.

రవికి కారు చాల వేగంగా డ్రయివు చేయటం యిష్టం. అప్పుడు నేను భయపడుతూంటే, తాను నవ్వుతూండే వాడు. లోలోన నాకు చాల భయంగా వున్నా వీలయినంతవరకు పైకి కనిపించకుండా కూర్చునేదాన్ని. ఒకటి రెండు సార్లు, మే మలా మెరీనాలో వెళ్ళుతుండగా, ఏక్సిడెంట్ జరిగినంత పని అయ్యింది. అత నలాంటప్పుడు నవ్వుతూ "ఏమిటి శశీ భయంగా వుందా ? జీవితం పైన అంత మమకార మెందుకు?" అనే వాడు. సరదాగా, కులాసాగా, నిశ్చింతగా కాలం గడుపుతూండే వ్యక్తి నోటినుండి, అలాంటి మాటలు విన్నప్పుడు నా మనస్సులో అనేక భావాలు పరుగులెత్తేవి.

ఒకరోజు ఏదో మాటల సందర్భంలో నా స్నేహితురాలు రమ నాకు రమ్మనమని ఉత్తరం వ్రాసిందనీ, నేను వాళ్ళింటికి వెళ్ళుతాననీ రవితో అన్నాను.

"రమా—!—ఆమె నీ రూమ్ మేట్ కదూ?...శేఖరు భార్య గదూ?" అని అడిగాడు రవి.

"అవును. నీకెలా తెలుసు?"

"నాకు వారిద్దరూ తెలుసు శశీ. రమను మొదట నాకు యిస్తానన్నారు" అన్నాడు నవ్వుతూ.

"మరెందుకు చేసుకోలేదు?"

"లేదు......అంతే......"

కొంతసేపు యిద్దరిలో ఎవ్వరమూ, మాట్లాడలేదు. నేను రమనుగూర్చి ఆలోచిస్తున్నా.

రమ పోయిన సంవత్సరం నా రూమ్ మేట్. పెళ్ళి అవటంతో చదువుకు స్వస్తి చెప్పింది. అప్పుడు రవికూడా రమను

గూర్చే ఆలోచిస్తున్నాడేమో, నాకు తెలియదు. అలా ఆలోచిస్తున్నాడనే నేను అనుకున్నాను.


కాసేపటికి రవి తలెత్తి "శశీ ఒక్క విషయం అడుగుతాను నిజం చెబుతావా?'' అన్నాడు నెమ్మదిగా.

ఏమడుగుతాడోనని నేను భయపడ్డ మాట మట్టుకు నిజం. అనదలచుకొన్న మాట చాలగట్టిగా, ఖచ్చితంగా, అని వేయటం రవికి అలవాటు. ''నన్ను పెళ్ళి చేసుకోవటం నీకు యిష్టమేనా?'' అని అడుగుతా డనుకొన్నాను. తడబడుతూ ''అడుగు...చెబుతా,'' అన్నాను.

''రమ సుఖపడుతుందనా, నీ ఉద్దేశ్యం ?''

"ఎందుకు సుఖపడదు? ఇద్దరూ చదువుకొన్నవారే. డబ్బుకు డబ్బూ వుంది'' అన్నాను ఎంతో తేలికపడ్డ హృదయంతోనూ, ఒక విధమైన నిరుత్సాహంతోనూ.

''అక్కడే పొరబడుతున్నావు శశీ. ఏదో చదువుకొన్నంత మాత్రాన, మానవునిలో పశుత్వం పోయి, అమరత్వం వస్తుందంటావా? అజ్ఞానికి అహంకారం అలంకారమట. అందులో డబ్బుంటే సరి, కన్నూ మిన్నూ కన్పించనే కన్పించవు" అని కొంతసేపు వూరుకొని, ''రమ విషయం నాకంతగా తెలియదుగాని, శేఖరు విషయం నాకు పూర్తిగా తెలుసు. నేను కూడా ఆ భాగ్యవంతుల తెగకు చెందిన వాడనేనని నీకు తెలుసునా, శశీ?



"అదేమిటిరా వెధవ, ఈ వయసులో సిగరెట్ల నేర్చుకుంటున్నావ్ ?"
"ఏదైనా నేర్చుకోవటానికి ఇదే మంచి వయసని మీరే చెప్పారుగా."

డబ్బూ, చదువు సంధ్యలూ వుండటం వేరూ, తోటి మానవుని అర్థం చేసుకోగల్గటం వేరు. నిజంగా నీవు వాళ్ళ మాటలు వింటే, యీ కాలంలో కూడా ఇలాంటి వాళ్ళున్నారనీ, చదువుకొన్నవారు కూడా, ఇలాంటి ఆలోచనలు కలిగి వుంటారా అనీ నీవు ఆశ్చర్యపోతావు. తామే గొప్పనుకోవటం, ఎదుటి వారిని చాలా తేలికగా చూడటం వాళ్ళకు అలవాటు. వాళ్ళు నూతిలోని కప్పలలా బ్రతుకుతారు శశీ.

శేఖర్ కూడా అంతే. నీవు అక్కడికి వెళ్ళినప్పుడు, నీ స్నేహితురాలు, సరదాగా వుండే నీ ప్రాణసఖి రమ ఇప్పుడు పంజరంలోని చిలుక అనీ, స్వంత ఉద్దే

ణాలు, కోర్కెలూ లేకుండా యాంత్రికంగా కాలం గడపే జీవచ్ఛవమనీ నీవే తెలుసుకొంటావు'' అన్నాడు చాల ఆవేశంగా.

మేము అంత కలిసి వుంటున్నా, అతని మనోభావాలను ఆసాంతం తెలుసుకొనటానికి నేను వెనుకాడుతుండేదాన్ని. అందుకని చెబుతూంటే వింటూ కూర్చునేదాన్ని. ఆ రోజులలో అట్లా వుండటం, అతనంటే గౌరవం వల్లనో, ప్రేమవల్లనో, భయంవల్లనో మరెందువల్లనో యిప్పుడు చెప్పలేను.

రమను గురించి అంత ఆవేశంగా అతను చెప్పిన తరువాత నే నేమీ అడుగనూ లేదు, అతను విడమరచి చెప్పనూలేదు.

నేను రమ వద్దకు వెళ్ళి రెండు రోజులున్నాను. రమ నోటితో చెప్పకపోయినా ఎంత నిస్సారంగా జీవితం గడుపుతుందో తెల్సుకొన్నప్పుడు చాల విచారించాను. తరువాత కలుసుకొన్నప్పుడు, ఎందుకనో గాని రవి రమను గూర్చి అడగలేదు, అతని మాటలలో ఎంత సత్యముందో నేను చెప్పనూలేదు. కాని అతను అడగనందుకు నాకు మాత్రం చాలా ఆశ్చర్యం వేసింది.

ఆనాడు మేము గడపిన మధుర క్షణాలు, మాట్లాడుకొన్న అనేక విషయాలు, అన్నీ నాకు గుర్తున్నాయి. గతాన్ని తల్చుకొంటూ వుండటం, ఆలోచించుకోవటం, బాధపడటం, మానవ నైజం. దానినుంచి కూడా ఒక రకమైన వూరటనూ, సుఖానుభూతినీ పొందటం కద్దు. ఎవరి విషయ మెలావున్నా, నా విషయంలో మట్టుకు అది ముమ్మాటికీ నిజం. అవన్నీ తలచుకున్నప్పుడు చాల సిగ్గుగా కూడా ఉంటుంది.

నేను, అనేకసార్లు రవి నా స్వవిషయాలను గూర్చి అడుగుతాడని ''నన్ను పెండ్లి చేసుకొంటావా శశీ" అని సూటిగా ప్రశ్నించుతాడని ఆశించుతూ వుండేదాన్ని. అటువంటప్పుడు ఎలా సమాధానం చెప్పాలా, అని భయపడుతుండేదాన్ని. కాని అనేక యితర విషయాలు నిర్మొహమాటంగా చెప్పి, అనేక విషయాలు సూటిగా అడిగే స్వభావంగల వ్యక్తి, యీ నా విషయంలో మాట్లాడేవాడు కాదు. ఎందుకలా వుంటుండేవాడో ఇప్పటికీ నాకు అర్థం కాలేదు.

ఒకసారి మా క్లాసువాళ్ళంతా కలిసి బృందావన్ గార్డెన్సుకు వెళ్లాము. రెండు రోజులు అక్కడే మకాం వేశాము. ఆ రెండు రోజులూ వొకఎత్తు. నా జీవితమంతా ఒక ఎత్తు. ఆ రెండు రోజులూ మేమిద్దరం, దాదాపు అందరినీ వదలి, వేరుగా తిరుగుతూ వుండేవాళ్ళం. ఆ రెండు రోజుల్లో మేమిద్దరం ఒకరి కొకరం వూహించుకోలేనంత దగ్గరయ్యాము. అది మంచికి జరిగిందో, చెడుకు జరిగిందో నాకు తెలియదు.

అయితే నేను యీ నాటికీ పశ్చాత్తాప పడటం లేదు.

ఆ రోజు పౌర్ణమి. వెన్నెల పిండి ఆరబోసినట్లున్నది. అందులో వసంత కాలమవటంవల్ల, మేము ఆశించినట్లు, ఆ రాత్రి ఎంతో చల్లగా, నిర్మలంగా హాయిగా, ఆహ్లాదంగా వుంది. మేము అక్కడి 'లాన్' పై కొంచం దూరంగా, ఒకరిప్రక్క నొకరం పరున్నాము.

మానవుని జీవితంలో అనేక సంఘటనలు అనుకోకుండానే జరుగుతుంటాయి. మన మెన్నోసార్లు చాలా జాగ్రత్తగా ఆలోచించి, అట్లా ప్రవర్తించాలి, యిట్లా నడుచుకోవాలి, అట్లాంటి ప్రశ్నలకు యిట్లాంటి సమాధానా లివ్వాలి, అని పరీక్షకు వెళ్ళే విద్యార్థినిలా, యుద్ధానికి తయారై వెళ్ళే సైనికునిలా ఎన్నో అనుకోవచ్చు. కాని ఆ క్షణం వచ్చినప్పుడు అన్నీ మర్చిపోతాము. ఆవేశంతో, మైకంలో మనం అనుకోనివే చేసి వేస్తాము. మరో క్షణంలో దాని పర్యవసానాన్నిగూర్చి ఆలోచించటం—పశ్చాత్తాపమే ననండి, సిగ్గు పడటమే ననండి—జరుగుతుంది.

ఆనా డున్నంత దగ్గరగ, నా హృదయంలో రవి ఏనాడూ లేడు. అలాగే నేను కూడా అతని హృదయానికి చాలా దగ్గరకు జరిగినట్లు తలచాను. ఎలా అడగ్గలానో నాకు తెలియదు. అలా




"అదేమిటిరా! కొశ్చెన్ మార్కు ఫేస్ పెట్టావు షేక్‌హ్యాండ్ ఇవ్వగానే."
"మొత్తానికి పశువుల డాక్టరుగ సార్థకం చేసుకున్నావురా బాబూ! నవనాడులు కుంగిపోయాయి"

అడిగినందుకు ఇప్పటికీ నా ధైర్యానికి నేనాశ్చర్యపడుతుంటాను కాని అడిగాను.

"రవీ, నిన్నొక్క విషయం అడుగాలనుంది...నీవు వేరుగా తలచకపోతే..."

"అడుగు శశీ, నీ కెందుకంత భయం నేనంటే? నేనూ మానవుడనే గదా. పైపెచ్చు నీకు సన్నిహితుడ్ని"

"అదిగాదు రవీ......"

"అడుగు శశీ. భయమెందుకు? నేను నిన్ను అడగటంలేదూ?"

"నీవు అప్పుడప్పుడూ ఏదో విచారంగా వుంటుంటావు. నిన్ను చూస్తే, నీ జీవితంలో విపరీత సంఘటన ఏదో జరిగినట్టుందని నా కనుమానం......"

"నీకలాంటి అనుమాన మెందు కొచ్చింది శశీ?"

"వసుదా, నీవు చాలా సరదాగా, కులాసాగా, నిశ్చింతగా జీవితం గడపదల్చుకొనే వాళ్ళల్లో వొకడవు. కాని అప్పుడప్పుడూ నీవు జీవితాన్నిగూర్చి ఎంతో విరక్తిగా మాట్లాడుతూ వుంటావు. అప్పుడు సరదాగా, నవ్వుతూవుండటం గతాన్ని మర్చిపోవటానికి నీవు ఆడుతున్న నాటకమని, నాకు అనిపిస్తూ వుంటుంది" అన్నాను చాల నిర్భయంగా.

"అవును శశీ," అని కొద్దిసేపాగి మళ్ళీ చెప్ప సాగాడు రవి.

"మా అమ్మకు, నాన్నకు నేనొక్కడనే కొడుకుని.వాళ్ళు చాల భాగ్యవంతులు కూడాను. అందుకనే భాగ్యవంతులన్న నాకు చాల హేయంగా వుంటుంది. మా వూళ్ళో మా కొక పది ఎకరాల తోట ఉంది.దానిలో మేము వేసవికాలంలోనూ, అప్పుడప్పుడు ఇతర కాలాల్లోనూ వెళ్ళి ఉండటానికి వొక యిల్లు కూడా వుంది. మా తోటప్రక్కన ఉన్న మరొక తోటలో ఒక పేద కుటుంబం కూడా వుంటుండేది. వాళ్ళకు ఒకే ఒక కూతురు. చాల అందంగా వుండేది. ఆ అమ్మాయి పేరు లలిత. నేను ఆ యింటిలో వున్నంత కాలం, ఆట పాటలతో, కలిసి మెలిసి మేమిద్దరం కాలం గడుపుతుండే వాళ్ళం. వయస్సుతోపాటు, మేము ఒకరికొకరం దూరమయ్యాం. అంతకన్నా, నాకు లలితకు ఎలాంటి సంబంధమూ లేదు. కాని నేను లలితను వివాహమాడ దల్చుకొన్నాను.

ఒకనాడు నా ఉద్దేశ్యం లలితకు చెప్పినప్పుడు, ఆమె చాలసేపు ఏమీ సమాధానం చెప్పలేదు. సిగ్గువల్లనేమో నను కొన్నాను. నేను చాల మూర్ఖుడ్ని శశీ, ఆమెకు యిష్టమో, కాదో, ఖచ్చితంగా చెప్పమని చాల కోపంగా అడిగాను.

"రవీ, అదెలా సాధ్యం?" అన్నది నెమ్మదిగా.

"ఎందుకుగాదు? నా పెళ్ళి నా యిష్టం నీకూ యిష్టమైతే సరి" అన్నా ఎంతో ఆవేశంతో.

"రవీ మనం కష్టాలను కొని తెచ్చు కుంటున్నాము"

"అంటే...నీ ఉద్దేశ్యం?"

"నీవు కలవారి బిడ్డవు. నేనా కూటికీ గుడ్డకూ కరువాసినవాళ్ళ పిల్లను...... అలాంటప్పుడు ... అదెలా సాధ్యం?" అన్నది.

నాకు కోపం వచ్చింది.

"నీకు యిష్టంలేకపోతే, యిష్టంలేదని చెప్పవచ్చుగా. ఎందుకిదంతాను? నాదే తప్పు. నన్ను క్షమించు. నీవు మంచి వాడ్ని చేసుకొని హాయిగా వుండు" అంటూ అక్కడనుంచి బయలుదేరాను.

"రవీ?" అంటూ లలిత పిల్చింది.

వెనుకకుతిరిగి లలిత దగ్గరకువెళ్ళి చూద్దునుగదా,ఆమెకన్నీరుకారుస్తూవుంది.

నేను ఏనాటికీ ఆ క్షణాన్ని మర్చిపో లేను శశీ. వేదాంతిలా భవిష్యత్తును సూచిస్తూ, ఎక్కువ చదువులేకపోయినా, లలిత చెప్పిన మాటలు, నా మూర్ఖత్వానికి కారణంగా కన్నీటితో నిండిన ఆమె కండ్లు, పశ్చాత్తాపడి మేము చేసుకొన్న బాసలు, మరువాలనుకొన్నా మరువ లేకుండా వున్నాను.

తరువాత ఒకనాడు మా అమ్మ నా పెళ్ళి విషయం తెచ్చింది. నేను మా అమ్మతో స్వేచ్ఛగా మాట్లాడ గలను గనక నా మనస్సులోని ఉద్దేశ్యాన్ని ఆమెకు చెప్పాను.

* * *

కొంతకాలం తరువాత నేను మళ్ళీ మా వూరు వెళ్ళేటప్పటికి లలిత తండ్రి చనిపోయాడనీ, మా తోట ప్రక్కనున్న ఎకరంపొలం మాకు అమ్మి, లలితా, వాళ్ళమ్మా, ఎక్కడకో వెళ్ళిపోయారనీ తెలిసింది. దానికంతకూ మా నాన్నే పుణ్యం కట్టుకొన్నాడట. ఊళ్ళో లలితకూ, నాకూ సంబంధ ముందనీ, లలిత తల్లే స్వార్థం కొద్దీ మాయిద్దరకూ సంబంధం ఏర్పరచిందనీ పుకార్లు పుట్టాయట. అవి భరించలేక, ఆ తల్లీ కూతురు అభిమానం కొద్దీ అక్కడ నుండి వెళ్ళి పోయారట.

దీనిలో మా నాన్న ఎలాంటి పాత్ర వహించి వుంటాడో నేను నీకు వేరుగా చెప్పనవుసరంలేదు. తదనంతరం ఒక నాడు మా నాన్న నన్ను పిలిచి రమను వివాహమాడమని అడిగారు. నేను చేసు కొనననని ఖచ్చితంగా చెప్పాను. అసలు ఆయనముందు నిల్చోని మాట్లాడటమంటే నాకిష్టముండదు. తోటివాళ్ళను పురుగులుగా చూచేవాళ్ళల్లో మా నాన్న ఒకరు. నిజానికి రమ అయితే యిష్టా, అయిష్టాలు, నాకేమీలేవు. అసలు రమను నేను బాగా ఎరుగను కూడాను. మా నాన్న అడగటంవల్ల, మరొక ఆలోచన లేకుండా, ప్రతీకారబుద్ధితో అన్నట్లు, కాదన్నాను.

తరువాత రమకూ, శేఖర్‌కూ వివాహం జరిగింది. మా నాన్నగారికి చాల కోపం వచ్చింది. ఆయనంటే మా యింట్లో అందరకూ హడలే. ఇహ ఆయనగార్కి కోపం వొస్తే చెప్పనే అవుసరంలేదు. ఆయన పట్టరాని కోపంతో, నన్ను తిడుతూ, నా అజ్ఞానానికీ, తెలివి తక్కువ తనానికి విచారిస్తూ, అంతస్థులు, కుటుంబ గొప్పతనం గూర్చి చెపుతూ లలితనూ, లలిత తల్లినీ దూషిస్తూ నీతి బోధలు చేశారు.

నేను నా కోపాన్ని అణచుకొందామని చాలా ప్రయత్నించాను. కాని రగులుతున్న నా హృదయం ఒక్కసారి గుప్పు మన్నది. మా తాతలు ఏ అంతస్థు నుండి ఏ అంతస్థుకు వొచ్చారో గుర్తుకు తెచ్చుకోమనీ మధ్య వొచ్చిన ముద

నష్టాలవల్ల గతాన్ని మర్చిపోవద్దనీ ఏదేదో నా నోటికి వచ్చినట్లు వాగాను.

అయనకు ఎదురుగా నిలబడి సమాధానం చెప్పినవాళ్ళు ఇంతవరకు ఎవ్వరూ లేరు. తన అహంకారం దెబ్బ తినటం వల్లనైతేనేమి, తను కలలో కూడ తలంచని విధంగా నేను సమాధానమివ్వటంవల్లనైతేనేమి, మా నాన్నగారు దెబ్బతిన్న బెబ్బులిలా లేచారు. కొడతారేమో అనుకొన్నాను. నేనూ ఏదోఒకటి తేల్చుకోటానికి భయపడకుండా నుంచున్నాను. వారు లలిత కుటుంబం ఎంత నీచకుటుంబమో ఏకరవు పెట్టటం మొదలుపెట్టారు. నేను భరించలేకపోయాను. ఆయనగారు కొద్ది నెలలక్రితం మా తోటలోనున్న చావిట్లో చేసిన పని గుర్తుకు తెచ్చాను. అంతే కాలితో నేలను గట్టిగా తన్నుతూ, నోటికొచ్చినట్లు తిడుతూ, ''నీవు నా కొడుకువుగాదు... నా కడుపున పుట్టలేదు. నా యింట్లో నుండి పో." అని కేకలువేసి అంగలు పంగలువేసుకొంటూ బైటకి వెళ్ళిపోయారు.

ఇది జరిగి దాదాపు సంవత్సరమయింది. అప్పటినుంచీ యింతవరకూ నేను మా యింటికి వెళ్ళలేదు. మా తాతగారు అంటే మా అమ్మ నాన్నగారి యింటికి మట్టుకు వెళ్ళుతుంటాను. అక్కడే మా అమ్మను అప్పుడప్పుడూ కలుసుకొంటుంటాను.

ఆమె చిక్కి శల్యమయ్యింది. ఎప్పుడూ ఏడుస్తూనే వుంటుందట. మా తాతగారే నా కిప్పుడు డబ్బు యిస్తున్నారు. నా కాళ్ళ మీద నేను నిలబడి నా బ్రతుకేదో నేను బ్రతకాలని వుంది. అ సుదినం ఎప్పుడొస్తుందో.

అప్పుడప్పుడూ నేనూ, మా నాన్నగారూ, యిలా వుండటం బాగాలే దనిపిస్తుంది. మా నాన్నకూ నాకూ ఎలాంటి మనస్పర్ధలూ లేవనీ, ఒక తరానికి మరొక తరానికి, ఆశయాలమధ్య కల్గిన సంఘర్షణే ననీ అనిపిస్తుంది. నిజానికి నా విచారమల్లా మా అమ్మనుగూర్చే. ఆమె కొరకే యింకా నేను బ్రతికున్నాను కూడాను. ఆమె నెప్పుడూ చూడాలని ఉంటుంది.——'' అంటూ, ఎంతో ఆవేశంలో చెప్పాడు.

తల్లిమాట వచ్చినప్పుడల్లా, అతని గొంతుక గాద్గదికమవటం నేను గమనిస్తూనే వున్నాను. అతని కళ్ళవెంట ఆ సమయంలో నీళ్లు కూడ కారివుండాలి.

నేను అతని మొఖంలోనికి చూడాలనుకొని కూడా చూడలేక పోయాను. కొంత సేపటికి అతను నాకు దగ్గరగా జరిగి కూర్చొని, నా రెండు చేతులూ పట్టుకొని "నన్ను అసహ్యించుకొంటున్నావా శశీ?" అని అడిగాడు, గద్గద స్వరంతో.

నేను ఏమీ మాట్లాడలేదు.

''శశీ నా హృదయంలో వున్న బాధ ఇంతవరకూ నేనెవరికీ చెప్పలేదు.

ఎవ్వరికీ చెప్పకూడదనుకొన్నాను కూడా. నీకు మాత్రం చెప్పాలనుకొంటూండే వాడిని. కాని నీ వేవిధంగా తీసుకొంటావో ననే భయంతో, యిన్నాళ్ళ నుండి నాకు నేనుగా చెప్పలేకపోయాను. ఈ ప్రపంచ ములో నాకేముంది? ఎవరున్నారు? అటు అమ్మా...'' అంటుండగా, అతని కన్నీటి చుక్కలు నా చేతులమీద పడ్డాయి. నా కళ్ళుకూడా కన్నీటితో నిండాయి. గొంతుకు ఏదో అడ్డుపడినట్లు మాట్లాడ లేక పోయాను.

* * *

ఆ తరువాత రవి ఒకనాటి సాయం కాలం వచ్చి బైటకు వెళ్ళి కాస్త కాఫీ త్రాగి, మెరీనాలో కూర్చొని పిచ్చాపాటి మాట్లాడుకోవచ్చు రమ్మన్నాడు.

నేను అతని మాటలకు వెంటనే సమాధానం చెప్పలేదు. చాలసేపు ఆ విషయం, యీ విషయం గూర్చి మాట్లా డుతూ కూర్చున్నాము. నాకు ఆనాడు బైటకు వెళ్ళటం ఎందుకు యిష్టంలేదో యీనాడు చెప్పగలనేమో! అతను నాకు, రావటం యిష్టంలేదని గ్రహించుంటాడు. నేను కూడ మాట్లాడుతూనే కారణం కొరకు వెదుకుతున్నాను. మాటల మధ్య లోనే "నీకు యీనాడు నాతో బైటకు రావటం యిష్టంలేదుగదూ. నేనొక పాపి నని నాకూ తెల్సు. నేను చనిపోతే నీ వేడుస్తావా శశీ?'' అంటూ సమా ధానం కొరకెదురుచూడకుండానే దబదబా బైటకు వెళ్ళి కారులో చాల విసురుగా కూర్చొని వెళ్ళిపోయాడు. నేను బిత్తర పోయి, వ్యాకులపాటుతో అతను వెళ్ళిన దిక్కుకే చూస్తూ నిల్చొన్నాను. మరొక క్షణంలో—రవికారు చాలా వేగంగా బైటకు వెళ్ళింది. ప్రక్కనుండి లారీ వచ్చింది—కెవ్వుమని పరిగెత్తాను. ఏముంది.? ... రవి రక్తంలో మునిగి వున్నాడు. ఆఖరిసారిగా కళ్ళుతెరచి ''శశీ......అమ్మా......'' అన్నాడు.

అంతే రవికి నాకు ఋణం తీరి పోయింది. రవికి యీ ప్రపంచానికి ఋణం తీరింది. నా జీవితంలో ఆ అధ్యాయం ముగిసింది. దీనికి కారణం?.. ...ఎవరు?...నేనే...ఆ పాపం నాకు కొట్టకుండా పోతుందా?......పోదు.

